ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





స్థానిక పోరుపై సందిగ్ధం

- ఆశావహుల్లో ఉత్కంఠ
- కొత్త రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

వాంకిడి, జూన్ 10: గడువు తీరినా గ్రామ పంచాయతీ పాలకవర్గాల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా లేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలుంటాయని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడటంలేదు. గత ఫిబ్రవరి1న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమ యంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. కానీ బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కుల గణన డిమాండ్ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పంచాయతీల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కొసాగిస్తారా.. మారుస్తారా.. అనే చర్చ అంతటా జరుగుతోంది.

2019లో ఎన్నికలు ఇలా..

అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్‌చట్టం 2018అమలులోకి తీసుకువచ్చి 2019లో సర్పంచి ఎన్నికలను నిర్వహించింది. జనవరి 1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. జనవరి 21,25,30 తేదీల్లో మూడు దశల్లో పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1న సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. 2024 ఫిబ్రవరి 1తో పదవీకాలం ముగియడంతో జిల్లాలోని 335పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనా బాధ్యతలు చేఉపట్టారు. 2018ఆగస్టులో రాష్ట్రంలో తొలిసారిగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చింది. 2019జనవరి వరకు ఆరునెలల పాటు కొసాగింది. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రత్యేకపాలన రావడం ఇది ఇప్పుడు రెండోసారి.

రిజర్వేషన్ల పీటముడితో..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీ రాజ్ చట్టం-2018 ఎన్నికల స్థానాలకు రిజర్వేషన్లు పదేళ్లపాటు వర్తిస్తాయని పేర్కొంటోంది. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక ఏమైనా మార్పులు చేస్తుందా..? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముంది. ఇందుకోసం ప్రస్తుతం చట్టంలో మార్పులు చేయాలి. ఇది జరగాలంటే మరో కొత్తచట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఈ ప్రక్రియ మొత్తం జరగాలంటే సమయం పడుతుంది. మరోవైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో స్థానిక సంగ్రామం ఆలస్యం కావొచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఎన్నికలు మరికొంత ఆలస్యమయ్యే అవకాశం ఉండడంతో ముందుకు వెళ్లాలా.. రిజర్వేషన్లు మారితే ఖరారైన తర్వాత అడుగు ముందుకు వేయాలా..? అనే సందిగ్ధంలో ఉన్నారు. ఒకవేళ రిజర్వేషన్లు మారితే పెట్టిన ఖర్చు వథా అవుతుందేమోనని ఆశా వహులు ఆరా తీస్తున్నారు.



ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్, జూన్ 10: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రెబ్బెన మండలం రాజారాం గ్రామానికి చెందిన గజ్జెల్లి సత్యమ్మ తనపేరిట మూడెకరాల భూమికి పట్టాదారు పాసు పుస్తకం జారీ చేయాలని దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన మధు కస్తూర్బా గాంధీ విద్యాల యంలో ఉపాధి కోసం దరఖాస్తు అందజేశారు. జైనూరు మండలం భూసిమెట్ట గ్రామానికిచెందిన బొల్లక్ ద్రుపతాబాయి తనపేరిట అటవీహక్కు పత్రాలు ఉన్నాయని రైతుబంధు మంజూరుకు దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(యు) మండలం కోహినూర్‌కు చెందిన శకుంతల కేజీబీవీలో వంట మనిషికి బదులు స్వీపర్ పని కల్పించాలని దరఖాస్తు అందజేసింది. బెజ్జూరు మండలానికి చెందిన తులసీరాం తనకు అటవీశాఖ నుంచి ఆరు సంవత్సరాల బీడీ ఆకు కమీషన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. జైనూరు మండలం ఆవపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ గుణవంతరావు 2012 డీఎస్సీలో ఎంపికైనందున తనకు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ ఏరియా సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసి ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు. బెజ్జూరు మండలం పాపనపేటకు చెందిన బుజాడి లక్ష్మి తాను సాగు చేసుకుంటున్న భూమిని తన పేరిట పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేసింది. కెరమెరి మండలం కొలాం కోటారి గ్రామానికి చెందిన బీము తన సోదరుడి పేరిట ఉన్న భూమిలో తనవాటా ఉన్నందున వాటా భూమి ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం తుమ్మలగూడ గ్రామానికి చెందిన జాడిశంకర్ పెన్షన్ మంజూరు కొరకు దరఖాస్తు అందజేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థి ప్రతిభ



తల్లిదండ్రులతో విద్యార్థి తరుణ్

ఆసిఫాబాద్, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ కళాశాలకు చెందిన బానోత్‌తరుణ్ 652వర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీలో అనుకున్న ర్యాంకు రాకపోవడంతో గిరిజనగురుకులాల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో లాంగ్‌టర్మ్ ఉచిత కోచింగ్ పొంది తాజాగా ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 652వ ర్యాంకుసాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థిని జిల్లా సమన్వయకర్త గంగాధర్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్‌లో 1782వ ర్యాంకు సాధించిన మండలకేంద్రానికి చెందిన దుర్గం అర్జున్‌ను సోమవారం మండల కేంద్రంలోని జేతావన్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్ సంఘం, జాతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘంనాయకుడు అశోక్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన అర్జున్.. తనతండ్రి ఏడునెలల క్రితం మరణించినప్పటికీ ఆ దుఃఖాన్ని దిగమింగి పట్టుదలతో చదువుకొని ఎలాంటి కోచింగ్‌లేకుండా జేఈఈ అడ్వాన్స్‌లో 1782ఆల్‌ఇండియా ర్యాంకు సాదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్‌సంఘం నాయకులు దుర్గం సునీల్, రోషన్, విజయ్, శ్యాంరావు, నారాయణ, ప్రశాంత్, అరుణ్, ప్రసాద్, ప్రతాప్, వినేష్, జగదీష్, తిరుపతి, మనుకుమార్, నటరాజ్, గిర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అద్దెబస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆసిపాబాద్, జూన్ 10: ఆర్టీసీలో పనిచేస్తున్న అద్దెబస్ డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డ్రైవర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. డ్రైవర్లను ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.32వేలవేతనం ఇవ్వాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, రోజు 8గంటల పనికల్పించాలని తదితర డిమాండ్‌లు చేశారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, శంకర్, మధుసూదన్, భాస్కర్, తేజ, విజయ్,సాయికృష్ణ, సంతోష్, తిరుపి, షకీర్, రషీద్, దశరథ్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

ఆసిపాబాద్, జూన్ 10: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని సోమవారం టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డీఈవో అశోక్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎటువంటి అవకతవక లకు పాల్పడకుండా ప్రక్రియ సజావుగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శాంతికుమారి, ఇందురావు, హేమంత్, రమేష్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

వాంకిడి, జూన్ 10: మండలకేంద్రంలోని విద్యుత్‌కార్యాలయంలో మంగళవారం విద్యుత్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉదయం9నుంచి విద్యుత్‌అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిల్లుల సమస్య, తదితర సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ అదాలత్‌లో ఏవో తుకారాం, ఏఏవో శ్రీనివాస్, ఏడీఈ బజరంగ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, జూన్ 10: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం ఏఐటీయూసీ నాయకులు అదనపుకలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరునెలల నుంచి వేతనాలు రాక కార్మికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపేందర్, వెంకటేష్, చిరంజీవి, ధర్మయ్య, మల్లయ్య, లక్ష్మణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్స్‌కు మూడు నెలలుగా అందని వేతనం

ఆసిఫాబాద్, జూన్ 10: ప్రభుత్వజనరల్‌ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్‌ఆఫీసర్లకు ప్రభుత్వం మూడునెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆవేధన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడువేల మందికి జనవరి 29న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. దీంతో 129మంది నర్సింగ్‌ఆఫీసర్‌లు పట్టణంలోని జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలకు కేటాయించారు. మూడు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించడం లేదని, క్యాజువల్ లీవ్స్ కూడా ఇవ్వడం లేదని జిల్లాలో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్‌లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

దళితులు సంఘటితం కావాలి

జైనూర్, జూన్ 10: దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రథమంగా సంఘటితం కావాలని భీంరావ్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని కాలేజీగూడలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన మాదిగ జనజాగృతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాదిగలు చైతన్యవంతులై చిన్నారులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతోనే జ్ఞానం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో మాదిగజాగృతి సంఘం మండల అధ్యక్షుడు జల్లపెల్లి రవీందర్, ప్రధానకార్యదర్శి ఎలగుర్తి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ పనులు పూర్తి



వెంపల్లి రైల్వే గేటు వద్ద పూర్తైన ఆర్‌వోబీ

సిర్పూర్(టి), జూన్ 10: సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వెంపల్లి రైల్వేగేటు వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా ఆర్‌వోబీని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్‌వోబీ ప్రారంభమైతే సిర్పూర్(టి), కాగజ్‌నగర్, కౌటాల, బెజ్జూరు, చింతలమా నేపల్లి మండలాల ప్రజలతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల కష్టాలు దూరం అయినట్లే.

అనుమతుల కోసం సమన్వయంగా ముందుకు సాగుదాం

- జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్



సమావేశంలో మాట్లాడుతున్న నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 10: జిల్లాలోని వివిధ రహదారులు, టవర్ల నిర్మాణం కోసం కావాల్సిన అటవీ అనుమతుల కోసం అన్ని శాఖల సమన్వయంతో ముందుకుసాగాలని జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న 24రహదారుతో పాటు వివిధటవర్ల నిర్మాణాలపై ఆసిపాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి వివిధ శాఖల అధికారులతో తనకార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న రోడ్లలో రహదారులు భవనాల శాఖ 12అనుమతులు రావాల్సి ఉన్నాయని, వీటిలో 11కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్ ఉన్నాయన్నారు. ఒకటి రాష్ట్రకార్యాలయంలో పెండింగ్‌లో ఉందని తెలిపారు. పంచాయతీరాజ్ విభాగంలో 7రోడ్లకు కాంట్రాక్టర్ వద్ద 5, 2అనుమతులు రహదారుల మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న 5రోడ్లకు కాంట్రాక్టర్‌వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే జియోటవర్ నిర్మాణంలో భాగంగా 6లో 5కాంట్రాక్టర్ వద్ద, 1తన వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. బీఎస్ఎన్ఎల్, ఎయిటెల్ టవర్లకు సంబంధించి 7లో 4కాంట్రాక్టర్ వద్ద 2మంత్రిత్వశాఖ వద్ద, 1జిల్లా కార్యాలయంలో పెండింగ్‌లో ఉందన్నారు. జిల్లాలో వివిధ పనులకు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. అయితే దరఖాస్తులు సరైనవిధంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయాశాఖలపై ఉందన్నారు. టెండర్ ప్రారంభ ప్రక్రియలోనే అటవీశాఖ అనుమతి తీసుకొని పనిప్రారంభిస్తే ఇబ్బందులు రావన్నారు. వివిధశాఖల అధికారులు ఈ విషయం తెలిసి కూడా అటవీశాఖను దోషిగా ప్రజలవద్ద నిలబెట్టడం సరైంది కాదన్నారు. ఆయాశాఖలనుంచి వచ్చే ప్రతిపాదనలు పెండింగ్ లేకుండా చూస్తామన్నారు. ఎప్పటికప్పుడు అనుమతులు ఇచ్చే విధంగా రాష్ట్ర కార్యాలయంతో సంప్రదిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అనుమతులు త్వరిగతిన వచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో ఎక్కు వగా అటవీప్రాంతంతో ముడిపడి ఉన్న రహదారులు ఉన్నాయని, వాటి నిర్మాణానకి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎఫ్‌ఆర్వో అప్పలకొండ, రహదారులు భవనాలశాఖ ఈఈ పెద్దన్న తదితరులు ఉన్నారు.

గిరిజన చట్టాలను పట్టించుకోని అధికారులను తొలగించాలి



ధర్నా చేస్తున్న ఆదివాసి సంక్షేమ పరిషత్ సభ్యులు

జైనూర్, జూన్ 10: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనచట్టాలను పట్టించుకోని అధికారులను విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంర శంకర్ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం తీరుపై ఆదివాసీ సంక్షేమపరిషత్ అధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆదివాసులు ధర్నాచేశారు. ఈ సందర్భంగా కుంరశంకర్ మాట్లాడుతూ స్థానిక మేజర్ గ్రామపంచాయతీ ఈవో, ఎంపీవోలు కలిసి ఏజెన్సీలో గిరిజనేతరు లకు ఇండ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇస్తున్నారని ఇదిరాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. వాటిని నిలిపివేయాలని వారికి ఇండ్లు నిర్మించేందుకు అనుమతి ఇవ్వకూడదని విన్నవించామన్నారు. అయినప్పటికీ అధికారులు తమతీరును మార్చుకోలేదన్నారు. దీంతో గిరిజేతరులు యథేచ్ఛగా ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆయనవిమర్శించారు. సమాచారం తెలుసుకున్న ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావ్ ధర్నాస్థలానికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. వారం రోజుల్లోగా విచారణ చేపట్టి న్యాయం చేస్తామ న్నారు. ఇదివరకే ఆదివాసీ సంక్షేమపరిషత్ నాయకులు చేసిన ఫిర్యాదులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడమన్నారు. గిరిజనులకు పూర్తిన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆదివాసిసంక్షేమ పరిషత్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేస్రాంషేకు, మహిళ విభాగం జిల్లాఅధ్యక్షురాలు గోడం జంగుబాయి, జిల్లాఅధ్యక్షుడు మడావి మనోహర్, మండలాధ్యక్షుడు సెడ్మకీ ఆనంద్ రావ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్‌ఐ సందీప్‌కుమార్ అధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

తిర్యాణి, జూన్ 10: మండలకేంద్రానికి చెందిన కూన చిన్న పోశయ్య(58) ఆదివారం రాత్రి జీవితంపై విరక్తిచెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోశయ్య బతుకుదెరువు కోసం 20సంవత్సరాల క్రితం మంచిర్యాల జిల్లా మందమర్రికి వెళ్లి భార్యబిడ్డలతో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో పోశయ్యకు పక్ష వాతం రాగా కుటుంబసభ్యులు మెరుగైన వైద్యాన్ని చేయించి ఆరోగ్యం కుదుటపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినా పోశయ్యకు పక్షవాతం కారణంగా కుడివైపు భాగంలో నొప్పి వచ్చింది. ఈ క్రమంలో పోశయ్య బాధతో మందులు వాడకుండా క్రమంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తిర్యాణి మండ లంలో ఉన్న అన్నదమ్ముల ఇంటికి వచ్చిన పోశయ్య సాయంత్రం బహిర్భూమికి అని చెప్పి ఇంట్లోనుంచి వెళ్లి మండలకేంద్రం సమీపంలోని ఎన్టీఆర్ సాగర్ కుడి కాలువ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

సిర్పూర్(టి), జూన్ 10: ఎరువుల దుకాణాల దారులు ఎరువుల, విత్తనాల ధరల వివరాలను బోర్డుపై రాయాలని ఏవో మధులత అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎరువులు దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి నకిలీ విత్తనాలు అమ్మితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో ఇంటింటికి తాగు నీరందించాలి



మాట్లాడుతున్న భిక్షపతి గౌడ్

కౌటాల, జూన్ 10: గ్రామాల్లో ఇంటింటికి తాగు నీటి సరఫరా జరిగేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం కౌటాలలోని రైతువేదికలో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి మండలాలకు చెందిన ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ, ఐకేపీసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో ప్రస్తుతం నీళ్ల అందుతున్న వివరాలు ప్రత్యేకయాప్‌లో పదిరోజుల్లో నమోదుచేయాలన్నారు. యాప్‌లో ఇంటియజమాని, కుటుంబసభ్యులవివరాలు, రోజుకుఎన్నిలీటర్ల నీటిని వినియోగిస్తున్నారు, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్‌నెంబర్ సహాఅన్ని వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలనిఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవోలు సత్యనారాయణ, ప్రసాద్, రమేష్ రెడ్డి, ఎంపీవోలు మహేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఏపీఎంలు దుర్గయ్య, ముక్తేశ్వర్ పాల్గొన్నారు.

జ్యోతి బాపూలే అవార్డు అందుకున్న ప్రణయ్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 10: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం పూణెలోని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ సాంస్కృతిక భవన్‌లో జరిగిన వెస్ట్రన్ ఇండియా బహుజన రైటర్స్ 4వ కాన్ఫరెన్స్‌లో మహాత్మజ్యోతి బాపూలే జాతీయ అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన బీసీ యువజనసంఘం జిల్లాఅధ్యక్షుడు అవిడపు ప్రణయ్‌కుమార్ అందున్నారు. కార్యక్రమంలో పాటమ్మ రాంబాబు, బహుజన సాహిత్య అకాడమీ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ప్రణయ్‌కుమార్

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిటౌన్, జూన్ 10: పట్టణంలోని సింగరేణి పాఠశాలలో 1నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లబోధనలో 200సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు దర ఖాస్తులు చేసుకోవాలని పాఠశాల కరెస్పాండెంట్, పీఎం శ్యాంసుందర్ సోమవారం తెలిపారు. ఆసక్తిగల వారు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

వయోపరిమితి పెంపు

మందమర్రిటౌన్, జూన్ 10: సింగరేణిలో కారుణ్య నియామకం కింద ఉద్యోగంలో చేరేవారికి 35సంవత్సరాలనుంచి 45సంవత్సరాలకు వయోపరిమితి పెంచుతూ సింగరేణియాజమాన్యం సర్క్యులర్ జారీచేసినట్లు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీజనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. దీంతోఉద్యోగంలో చేరే కార్మికుల పిల్లలకు ఊరటఉంటుందని, వేలమందికి న్యాయం జరుగుతుందన్నారు.

కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 10: కంపెనీ కార్మికులకు డ్రైవింగ్‌లో ప్రత్యేకశిక్షణ ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఈమేరకు ఆయన కొత్తగూడెంలోని జీఎం (పర్సనల్) కు లేఖ రాశారు. ఈనెల 18నుంచి 21వరకు సింగరేణివ్యాప్తంగా ఈపీ ఆపరేటర్ డ్రైవింగ్ టెస్ట్ జరుగుతుందన్నారు. 60పోస్టుల(ఇంటర్నల్)కోసం 1705మంది సింగరేణికార్మికులు పోటీ పడుతున్నట్లు చెప్పారు. వారికి ఈనెల30న రాతపరీక్ష ఉన్నందున, టెస్ట్‌కువెళ్లే అభ్యర్థులకు కంపెనీలారీ ద్వారా శిక్షణ ఇప్పించాలన్నారు. ప్రస్తుతం కార్మికులు వివిధవిభాగాల్లో ఉన్నందునవారికి డ్రైవింగ్‌పై పూర్తి పట్టు ఉండదన్నారు. ఈ విషయంలో యాజమాన్యం వెంటనే స్పందించి శిక్షణ ఇప్పించాలని ఆయన కోరారు.



కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మందమర్రి టౌన్, జూన్ 10: ఏరియాలోని ఆయాగనుల, డిపార్టుమెంట్ల కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం కృషి చేయాలని బ్రాంచి ఉపాధ్యక్షుడు కంది శ్రీనివాస్, కేకే5 పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ కోరారు. సోమవారం యూనియన్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ గనుల వద్ద తాగు నీరు సరఫరా, రెస్ట్‌హాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కాసిపేట2తోపాటు కేకే ఓసీ, సీఎస్‌పీకి సంబంధించిన సమస్యలపై జీఎం, పై అధికారులకు విన్నవిస్తామన్నారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

రెబ్బెన, జూన్ 10: బెల్లంపల్లిఏరియాలోని భూనిర్వాసితులకు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పనుల్లో అవకాశం కల్పించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్‌కు హెచ్‌ఎంఎస్ యూనియన్ బెల్లంపల్లి ఏరియా వైస్‌ప్రెసిడెంట్ రాజబాబు ఆధ్వర్యంలో నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూనిర్వాసితులకు ఔట్‌సోర్సింగ్‌లో వెంటనేఉద్యోగఅవకాశాలు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో శంకరమ్మ, తులసీరాం, లక్ష్మణ్, పార్వతి, రాజేశ్వరి ఉన్నారు.

హామీలను అమలు చేయాలి

మందమర్రిటౌన్, జూన్ 10: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఎల్‌బీకేఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. సోమవారం గోదావరిఖనిలో జరిగిన ఐఎఫ్‌టీయూ రాష్ట్రకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషిచేయాలి: జీఎం



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రి టౌన్, జూన్ 10: ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యసాధనకు అందరూ అంకిత భావంతో కృషిచేయాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. సోమవారం ఏరియాలోని శాంతిఖని గనిని సందర్శించారు. ప్లాన్‌లను పరిశీలించారు. రోజు వారీగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమనే విషయాన్ని అధికారులు, ఉద్యో గులు దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వహించాలన్నారు. ఏరియా అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యం కంటే అదనపు ఉత్పత్తితోనే ముందుంటామని తెలిపారు. అనంతరం ఆయన గనిలోకిదిగి పని ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో శాంతిఖని ఏజెంట్ విజయప్రసాద్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గ్రూపు ఇంజనీర్ బసవరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 10: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం వి పురుషోత్తమరెడ్డి అన్నారు. ఎస్ఆర్పీ1 గనిపై సోమవారం మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటితే పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమంతోపాటు పర్యావరణ పరిరక్షణకు సంస్థ కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గనిఆవరణలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను ఉద్యోగులకు అప్పగించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియా పర్యావరణ అధికారి హన్మాన్ గౌడ్, గనిమేనేజర్ విజయ్ కుమార్, రక్షణాధికారి చంద్రముర్కు, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య పాల్గొన్నారు.

35శాతం లాభాల వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 10: ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన వాస్తవ లాభాల నుంచి 35 శాతం వాటా కార్మికులకు అందించాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఠాకూర్ మణిరామ్ సింగ్, కుంచెభూపతి అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యాజమాన్యం మూడు నెలలైనా లాభాల వాటాపై ప్రకటన చేయడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సైతం కోల్ ఇండియాలో మాదిరిగా పర్మనెంట్ కార్మికుల మాదిరిగా వేతనాలు, లాభాల వాటా, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గరిగంటి రాజయ్య, ఎండి హసన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రైటర్‌మైండ్స్ శిబిరం నిర్వహించడం అభినందనీయం



మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 10 : పిల్లల్లో మానసిక వికాసానికి శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో బ్రైటర్‌మైండ్స్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో శిక్షణ పొందిన పిల్లల ప్రతిభను ప్రదర్శించగా వారిని అభినందించారు. కలెక్టర్ మాట్లడుతూ ప్రస్తుత సమాజంలో వివిధ రకాల మాధ్యమాలు, పరికరాలతో ఆలోచన శక్తి క్షీణిస్తుందన్నారు. పిల్లల మెదడుపై ఒత్తిడిని తగ్గించేందుకు విద్య, పోషకాహారం, మంచి నిద్ర, యోగా, మెదడుకు వ్యాయామం ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌లు వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.3లక్షలు తీసుకొని నకిలీ నియమాకపత్రం అందజేత
- ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు

సుభాష్‌నగర్, జూన్10: కరీంనగర్ జిల్లాఆసుపత్రిలో జీఎన్ ఎమ్‌నర్స్‌గా (జనరల్‌నర్సింగ్ మిడ్‌వైఫరీ) ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3లక్షల రూపాయలు దండుకొని దొంగనియామకపత్రాలు అందజేశారని బాధితురాలి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నుంచి బతుకుదెరువు కోసం 13సంవత్సరాల క్రితం మౌల్కర్ కవిత-దిలీప్ దంపతులు నగరానికి వచ్చారు. దిలీప్ స్థానికంగా పాన్‌టేలా నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. దిలీప్‌కు ఓస్నేహితుని ద్వారా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఈక్రమంలో జిల్లా ఆసుపత్రిలో జీఎన్‌ఎమ్ నర్స్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికాడు. ఉద్యోగంకోసం 5లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పి ముందుగా 3లక్షలు తీసుకున్నాడు. చాలారోజులుగా ఉద్యోగం గురించి బాధితులు అడుగుతుండడంతో కలెక్టరేట్ ఏవో, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నుంచి నకిలీ నియామక పత్రాలు ఇచ్చాడు. అనంతరం వారు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా ఆపత్రాలు నకిలీవి అని తేలింది. దీంతో వారు రాజయ్యను నిలదీశారు. అతడు తాను తీసుకున్న డబ్బుకు బాండు పేపర్ రాసిచ్చాడు. ఆ తర్వాత చాలా సార్లు రాజయ్యను డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తీసుకువచ్చినా రేపు, మాపు అంటూ వాయిదాలు వేసుకుంటూ వచ్చాడు. ఇటీవల ఆయనను డబ్బుల విష యంలో నిలదీయడంతో అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషిం చడమే కాకుండా తమపై దాడికి ప్రయత్నించాడని బాధిత దంపతులు ఆరోపించారు. రాజయ్యపై చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

గోదావరిలో గల్లంతై వ్యక్తి మృతి

జైపూర్, జూన్ 10 : మండలంలోని శివ్వారం గ్రామానికి చెందిన బైరి మధుగౌడ్ (62) ఆదివారం శివ్వారం సమీపంలోని గోదావరి నదిలో గల్లంతై మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గంగాపూర్‌లో బంధువులు మృతి చెందడంతో అక్కడికి వెళ్లాడు. దహన సంస్కారాల అనంతరం తిరిగి మధుగౌడ్ కుటుంబీకులను ఆటో ఎక్కించి తాను గోదావరి నది దాటి వస్తానని చెప్పాడు. నది దాటుతున్న క్రమంలో నదిలో గల్లంతయ్యాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గోదావరి నది వద్దకు వెళ్లి చూడగా నది ఒడ్డున మృతదేహం కనిపించింది. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హాజీపూర్, జూన్ 10: మండలంలోని టీకనపల్లికి చెందిన దాసరి సత్తయ్య (45) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తయ్య తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో యేడాది క్రితం భార్య ఇద్దరు కొడుకులను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. సత్తయ్య ఒంటరితనంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతుడి తమ్ముడు దాసరి చంద్రశేఖర్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అందజేత

జన్నారం, జూన్ 10: మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన మనోహర్‌రావు గత నెల 14న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ రాజవర్ధన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి సోమవారం బాధితునికి అందజేశారు. దీంతో పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

జన్నారం, జూన్ 10: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం అటవీ శాఖ అధికారులు పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. తహసీల్దార్ రూ. 15 వేల జరిమానా విధించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి



విచారణ అధికారికి వినతిపత్రం ఇస్తున్న దీపక్‌కుమార్

బెల్లంపల్లి, జూన్ 10: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని శాఖ పరమైన విచారణ అధికారి చక్రపాణికి సోమవారం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దీపక్‌కుమార్ వినతిపత్రం అందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన మత ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, బస్‌పాస్‌ల ఫారాలపై సంతకాల కోసం వచ్చిన విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, దీంతో విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారన్నారు. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 10: జిల్లాలో మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ఇంటింటి నల్లా కనెక్షన్‌ల సర్వే ప్రక్రియను పది రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ ఈఈ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నల్లా కనెక్షన్‌ల సర్వేను మొబైల్ యాప్ ద్వారా 10 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నల్లా కనెక్షన్‌లు కలిగిన నివాసాలు, ఇవ్వాల్సిన కనెక్షన్‌లు, నూతనంగా నిర్మించిన ఇండ్లకు ఇవ్వాల్సిన కనెక్షన్ల వివరాలతో కూడిన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో ఇంటింటికి వెళ్లి ఇంటి యజమానితోపాటు కుటుంబ సభ్యుల ఆధార్ నెంబర్లు, కులం, సెల్‌నెంబర్, నీటి సరఫరాకు సంబంధించి ఫొటోలను యాప్‌లో పొందుపర్చాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, అదనపు పంచాయతీ అధికారి, ట్రైనింగ్ రీసోర్స్ పర్సన్‌లు మల్లేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాల వ్యాప్తిని నియంత్రించాలి

వర్షాకాలంలో విష జ్వరాల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అతిసార, కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధులు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా లార్వాదశలోనే నిరోధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్య సేవలందించాలన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్, వైద్య ఆరోగ్య శాఖ , తదితర అధికారులు పాల్గొన్నారు.

భూదందాలకు పాల్పడితే సహించేది లేదు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

భీమారం, జూన్ 10: మండలంలో ఎవరైనా భూకబ్జా, ఇసుక దందాలకు పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం రైతువేదిక వద్ద 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకుని వచ్చే వారిపై రెవెన్యూ, పోలీసు అధికారులు నిఘా ఉంచాలన్నారు. పార్టీ, తన పేరు, ఎంపీ పేరును వాడుకుని దందాలకు పాల్పడవద్దని పార్టీ నాయకులకు హెచ్చరించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే పెద్ద సంఖ్యలో బోర్లు వేయించానని, అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. తహసీల్దార్ సదానందం, ఆర్‌ఐ స్రవంతి, నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, అనిల్, రమేష్, అమర్‌సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు సమస్య పరిష్కారం

చెన్నూరు: పెద్ద చెరువులో చేపల వేట కోసం ముదిరాజ్‌లు, గంగపుత్రుల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామికి విన్నవించారు. ఎమ్మెల్యే మత్స్యశాఖ ఏడీని పిలిపించి మాట్లాడారు. గంగపుత్రులు, ముదిరాజ్ కులస్తులకు చెరువులో చేపలు వేటాడేందుకు ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో ఏండ్లుగా గంగపుత్రులు, ముదిరాజ్‌ల మధ్య కొనసాగుతున్న చేపల వేట వివాదం ఎమ్మెల్యే చొరవతో ముగిసింది. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేను ముదిరాజ్ కులస్తులు సన్మానించారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు బీటెక్‌లో 18 సీట్లు కేటాయింపు

శ్రీరాంపూర్, జూన్ 10 : సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 2024-25 విద్యా సంవత్సరానికి బీటెక్ కోర్సులో 18 సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎం(హెచ్‌ఆర్‌డి) సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మంథని జెఎన్‌టీయూలో 18 సీట్లుఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ఈఏపిసెట్-24లో అర్హత సాధించిన వారు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగూడెంలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకతీయ యూనివర్శిటీ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్‌లో 2 సీట్లు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 2, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో 2, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 2 మొత్తం 10 సీట్లు భర్తీ చేసేందుకు ఈఏపిసెట్-24లో అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థినికి పురస్కారం

చెన్నూరు, జూన్ 10: హైద్రాబాద్ రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థిని తుమ్మల యశస్విని ప్రతిభా పురస్కారం, ప్రశంసా పత్రం అందుకుంది. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదివిన యశస్విని 10 జీపీఏ సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తిని ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

వర్షాకాలంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

● మంత్రి సీతక్క



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్, తదితరులు

ఆసిఫాబాద్, జూన్ 10: రాబోయే వర్షాకాలంలో ప్రజారోగ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, అదనపుకలెక్టర్‌లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీకార్యదర్శులతో వరదలు, తాగునీరు, పారిశుధ్యం, విషజ్వరాల వ్యాప్తి నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో ప్రజారోగ్యం, రక్షణ అంశాలపై అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో తాగునీరు, పారిశుధ్య, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు, మురుగు కాలువలను పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. దోమలు వ్యాప్తిచెందకుండా ప్రతివారందోమల మందు పిచికారి చేస్తామని తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపర్చడం, కలుషితనీరు తాగకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాని తెలిపారు. విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మారుమూల గ్రామాల్లో వైద్య సిబ్బందిని అప్రమత్తంచేసి తగు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి తుకారాం భట్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మిషన్‌భగీరథ ఈఈ వెంకటపతి, తహసీల్దార్‌లు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వర్షాకాలం సాగు పనులు



బెజ్జూరులో విత్తనాలు వేస్తున్న మహిళలు



చింతలమానేపల్లిలో అరక పట్టి సాలు వేస్తున్న రైతు

బెజ్జూరు/చింతలమానేపల్లి/సిర్పూర్(టి), జూన్ 10: ఇటీవల తొలకరి వర్షాలు కురియడంతో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతులు దుక్కులు దున్నుకొని సిద్ధంచేసుకోగా నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలో రైతులు పత్తివిత్తనాలు విత్తుతున్నారు.

ఇక వర్షాలు కురిస్తే విత్తనాలు మొలకెత్తేందుకు వీలుంటుందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయపనుల్లో రైతులు బిజీబిజీ గడుపుతున్నారు. కాగా వ్యవసాయ అధికారులు మాత్రం విత్తనాలు విత్తడంలో తొందర పాటు వద్దని భూముల్లో ఇంకా వేడి తగ్గలదేని సూచిస్తు న్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ!



లగ్గాం సమీపంలో గుంతల మయమైన బీటీ రోడ్డు

దహెగాం, జూన్ 10: మండలకేంద్రం నుంచి లగ్గాం సమీపంలోని పెంచికలపేట ఎక్స్‌రోడ్డు వరకు బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. ఒడ్డుగూడ, చిన్నరాస్పెల్లి, గిరివెల్లి, గెర్రె, రావులపల్లి, మొట్లగూడ, రాంపూర్, దిగిడ గ్రామాల ప్రజలు నిత్యం అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా పెంచికల పేట, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల ప్రజలు బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాల అవసరాల కోసం ప్రయాణం చేస్తారు. ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేస్తుంటారు. గుంతల రోడ్డుతో వాహనాలు దెబ్బతిని తరుచూ మరమ్మతుల పాలు వుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. గుంతలరోడ్డును మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పోడు భూములపై చర్చలు జరిపిన ఆర్డీవో



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన పోడు రైతులు

కాగజ్‌నగర్, జూన్ 10: కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో పోడుభూముల సమస్యపై రైతులతో సోమవారం ఆర్డీవో సురేష్ చర్చలు జరిపారు. తమ భూములకు పట్టాలున్నా అటవీశాఖ అధికారులు సర్వేలు చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని సోమవారం గ్రామపోడు రైతులు ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో సురేష్ ఇరుశాఖల అధికారులతో చర్చలు జరిపారు. అంకుసాపూర్ పోడు భూములపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగసత్యనారాయణ మాట్లాడుతూ పోడు రైతులకు న్యాయం చేయాలన్నారు. అన్యాయం జరిగితే పోరుబాట పడుతామని పేర్కొన్నారు.అనంతరం వివిధడిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్‌కిరణ్, ఆర్డీవోసురేష్‌కు రైతులు అందజేశారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల నిరసన

దహెగాం, జూన్ 10: మండలకేంద్రంలోని అంగడి బజార్ ఏరియాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ టీఎస్‌ఎంసీ, ఎన్‌ఎంసీ సంస్థలు ఆకస్మిక తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. తనిఖీలు నిలిపి వేయాలని కోరుతూ డీటీ లలితకు వినతిపత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

పంట డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం

పురుగుల మందు డబ్బాతో ప్రజావాణికి



పురుగుల మందు డబ్బాతో వచ్చిన రైతు

నెన్నెల, జూన్ 10: ఐకేపీ ద్వారా కొనుగోలు చేసిన మామిడికాయల డబ్బులు ఇవ్వకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన రైతు రామడుగు జనార్ధన్ పేర్కొన్నాడు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి పురుగుల మందు డబ్బాతో వచ్చాడు. అధికారులు సమస్యను పరిష్కరిస్తామని, అఘాయిత్యానికి పాల్పడవద్దని సముదాయించారు. జనార్ధన్ మాట్లాడుతూ ఐకేపీ ఆధ్వర్యంలో చిత్తాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. నెల రోజుల క్రితం ఐదు టన్నుల మామిడి కాయలను విక్రయించగా కేజీకి రూ.35 ఇవ్వాల్సి ఉండగా రూ.26 మాత్రమే చెల్లిస్తామని చెబుతున్నారని పేర్కొన్నాడు. తనకు రూ.1.75 లక్షలు రావాల్సి ఉండగా రూ.1.15 లక్షలు చెల్లించారని మిగతా రూ. 60 వేలు ఇవ్వడం లేదని వాపోయాడు. డబ్బులు ఇవ్వకుండ కార్యాలయం చుట్టు తిప్పుకుంటుండడంతో గత్యంతరం లేక పురుగుల మందు డబ్బాతో వచ్చానన్నాడు. ఏపీఎంను వివరణ కోరగా మామిడికాయలు వీగ్రో కంపెనీకి విక్రయించామని, కంపెనీ నుంచి డబ్బులు రావాల్సి ఉందన్నారు. కాయలు నాణ్యంగా లేవని కంపెనీ ధరలో కోత విధిస్తుందన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు నష్టం జరగకుండా ఒప్పందం కుదుర్చుకున్న ధర చెల్లిస్తామని ఏపీఎం పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏసీసీ, జూన్ 10: విద్యుత్ తీగల మరమ్మతు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్, ఏఈ సంధ్యారాణిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంనగర్, కాలేజీ రోడ్డు, ఎల్‌ఐసీ కాలనీ, రెడ్డికాలనీ, ఐబీ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



బండి సంజయ్‌తో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎంపీ గోడం నగేష్, డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూన్ 10: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ని ఢిల్లీలో ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా నాయకులు కలిశారు. ఈ సందర్భంగా శాలువలు, పూలమాలతో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎంపీ గోడం నగేష్ తదతరులున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కౌటాల, జూన్ 10: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలకేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో వానుపటేల్, శ్రీశైలం, భీమన్నమల్లయ్య, రవి, మోతిరాం, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

వాంకిడి, జూన్ 10: విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని ఎంఈవో మనుకుమార్ అన్నారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకుఉచితంగా ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను అందిస్తుందని విద్యార్థులు వీటినిసద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రాపవుట్ లేకుండా చర్యలు

జైనూర్, జూన్ 10: గిరిజన గ్రామాల్లో డ్రాపవుట్ లేకుండా చర్యలు చేపడుతున్నామని రాసిమెట్ట ఎస్సీఆర్పీ కొట్నాక భీంరావ్ అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న బడిబాటలో భాగంగా సోమ వారం మండలంలోని షేకుగూడ, గౌరి కొలాంగూడ, జాడు గూడ తదితర గ్రామాల్లో ఆయన డ్రాపవుట్ పిల్లల్ని చైతన్యవంతులు చేశారు. వారి తల్లిదండ్రులకు బడిబాటపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో 10మంది డ్రాపవుట్ పిల్లల్ని గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామస్థులు ఎస్సీఆర్పీ కొట్నాకభీంరావ్, హెచ్‌ఎం కొట్నాక బూదు బాయిని అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రెబ్బెన, జూన్ 10: రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు పలువురిని ఎంపిక చేసినట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్, ప్రధానకార్యదర్శి కల్పనతెలిపారు. ఎంపికైన వారిలో అండర్-9 విభాగంలో దేవాన్ష్, ఎం శ్రీకాంత్, తన్విక, వినూత్న, శరత్, అండర్-13 విభాగంలో జాన్సన్, బి భార్గవ్, పి మేఘన, ఎం కృషిక, కౌశిక్ ఉన్నట్లు వివరించారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగ పోటీల్లో ఆడతారని తెలిపారు.


చెన్నూరులో పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

నకిలీ విత్తనాలపై టాస్క్ 'ఫోర్స్'

విత్తన దందా ఇలా...

పోలీసుల కండ్లు గప్పి వివిధ రాష్ట్రాల నుంచి స్మగ్లర్లు జిల్లాకు తరలిస్తున్నారు. విడి విత్తనాలు, బట్టసంచుల్లో ప్యాక్ చేసిన నకిలీ విత్తనాలను నేరుగా రైతులకు అంటగడుతున్నారు. జిల్లాలోని కొందరు డీలర్లతో సత్సంబంధాలు నెరపుతున్న సదరు ముఠా సభ్యులు తక్కువ ధరకు వారికి సరఫరా చేస్తున్నారు. లైసెన్స్‌డ్ డీలర్ల కంటే బయటి వ్యక్తుల వద్ద విత్తనాలు చవకగా లభిస్తుండటంతో రైతులు వాటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యమైన విత్తనాలతో చేసే సాగుతో పోల్చితే నకిలీ విత్తనాలతో చేసే సాగుకు పెట్టు బడిలో భారీగా వ్యత్యాసాలు ఉండటంతో రైతులు వాటిపై వైపే మొగ్గు చూపుతున్నారు. పోలీసుల తనిఖీల్లో భారీగా నకిలీ పత్తి విత్తనాలు బయట పడుతున్నాయి. నకిలీ విత్తనాల దుష్ప్రభావం, వాటి వల్ల కలిగే నష్టాలపై వ్యవసాయ, పోలీసులు శాఖలు సంయుక్తంగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నా ఆశించిన ఫలితం ఉండటం లేదు.

మంచిర్యాల కేంద్రంగా కోట్ల వ్యాపారం
వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి
పోలీసుల కళ్లుగప్పి రైతులకు సరఫరా

మంచిర్యాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో పత్తి సీజన్ సమీపిస్తున్న తరుణంలో నకిలీ విత్తనాల విత్తనాల దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంగా రూ.కోట్లు విలువ చేసే నకిలీ దందా సాగుతోంది. పోలీసుల కండ్లు గప్పి వివిధ రాష్ట్రాల నుంచి స్మగ్లర్లు జిల్లాకు తరలిస్తున్నారు. నకిలీ పత్తి విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు రామగుండం కమిషనరేట్‌లోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడులకు పాల్పడుతున్నారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్థానిక పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పోలీసుల దాడుల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. కోటి పైచిలుకు విలువ చేసే నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి.

వివిధ రాష్ట్రాల నుంచి సరఫరా

మంచిర్యాల జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు దిగుమతి అవుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, ప్రకాశం, నంద్యాల నుంచి పెద్ద మొత్తంలో సరఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి, అక్కడి నుంచి అక్రమంగా జిల్లాలోని రైతులకు విక్రయిస్తున్నారు.

స్మగ్లర్లు నకిలీ విత్తనాలను ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు వాహనాల్లో తరలిస్తున్నారు. ఆంధ్రకు చెందిన కొందరు పత్తిసాగు పేరుతో జిల్లాలోని మందమర్రి, బెల్లంపల్లి, జైపూర్, తదితర ప్రాంతాలలో నివాసం ఉంటారు. ఇక్కడి భూములను కౌలుకు తీసుకొని నామమాత్రంగా వ్యవసాయం చేస్తూ ఇక్కడి విత్తన డీలర్లు, రైతులతో పరిచయాలు పెంచుకుంటారు. వారికి అనుకూలంగా ఉన్న వారితో నకిలీ పత్తి విత్తనాలను రవాణా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా అక్కడ క్కడ పోలీసులు జరిపిన దాడుల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు వ్యక్తులు పట్టుబడటమే దీనికి నిదర్శనం.

నకిలీ విత్తనాలతో దుష్ప్రభావం

పోలీసుల దాడుల్లో అధికంగా పట్టుబడుతు న్న వాటిలో నిషేధిత (బీటీ-3) విత్తనాలతోపాటు హెచ్‌టీ కాటన్ (హెర్బిసైడ్ టాలరెన్స్) అధికం గా ఉంటున్నాయి. ఇవి జన్యు మార్పిడి చేసిన పత్తి విత్తనాలుగా వ్యవసాయ అధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. ఈ విత్తనాలు గ్లైఫోసెట్ అనే కలుపు మందును తట్టుకుంటాయి. ఈ కలుపు మందు పత్తి పంటను కాకుండా మిగతా అన్ని కలుపు మొక్కలను నాశనం చేస్తుంది. అయితే గ్లైఫోసెట్ మందు కేన్సర్ కారకమని, పర్యావరణానికి హాని కలిగిస్తున్నందున ప్రభుత్వం నిషేధించింది.

కఠిన చర్యలు తీసుకుంటాం
రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్



ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు, గ్లైసిల్ గడ్డి మందు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకొంటాం. ప్రభుత్వ సూచనలు, నిబంధనలకు అనుగుణంగా డీలర్లు విక్రయాలు సాగించాలి. నిషేధిత విత్తనాలు వాడే రైతులకు నష్టం వాటిల్లుతుంది. నకిలీ విత్తనాలు విక్రయించే ముఠా సభ్యుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలుపాలి. జిల్లాలోకి నకిలీ విత్తనాల ముఠా ప్రవేశించే అవకాశాలున్న అన్ని బార్డర్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశాం. నకిలీ విత్తనాల సరఫరాను ప్రోత్సహించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

భీమారం: భీమారం మండల కేంద్రంలోని ఆవడం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం ఉదయం 107 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, ఎస్‌ఐ రాములు తెలిపారు. ఆవడం ఎక్స్ రోడ్డు వద్ద చుండు నాగేశ్వర్‌రావు మూడు సంచులతో ఆటో కోసం వేచి చూస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా విత్తనాలు లభించాయన్నారు. మండల వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ వాటిని పరిశీలించి నకిలీ విత్తనాలుగా తేల్చారన్నారు. నిందితున్ని విచారించగా గుంటూరు జిల్లాకు చెందిన తాను భీమారంలో కౌలు సాగు చేస్తానని తెలిపాడన్నారు. కర్నూల్‌కు చెందిన ఒకరి వద్ద నకిలీ పత్తి విత్తనాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ అమ్మడానికి తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నాడన్నారు. పట్టుకున్న నకిలీ విత్తనాల విలువ సుమారు రూ.3.20 లక్షలు ఉంటుందని తెలిపారు.


పట్టుకున్న నకిలీ విత్తనాలతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు

ఆకట్టుకున్న నృత్య పోటీలు


నృత్యాలు చేస్తున్న కళాకారులు

ఏసీసీ, జూన్ 10: జిల్లా నృత్య కళా సమాఖ్య ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి నృత్య కళా పోటీలను సోమవారం జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో దాదాపు 300 మంది కళాకారులు పాల్గొని శాస్త్రీయ, జానపద, సినిమా నృత్యాలు ప్రదర్శించారు. మాజీ కౌన్సిలర్‌లు బొలిశెట్టి కిషన్, చింతకింది మల్లయ్య, కాపు సంఘం నాయకుడు మిట్ట లక్ష్మణ్, విశ్వనాథ ఆలయ డైరెక్టర్ ఒడ్నాల రవీందర్, నృత్య కళాశాల అధ్యక్షుడు రాకం సంతోష్, గౌరవాధ్యక్షుడు హన్మాండ్ల మధుకర్, డ్యాన్స్ మాస్టర్‌లు లక్ష్మణ్, అర్జున్, సది, రమేష్, శ్యాం, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం


ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 10: మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో సోమవారం పింగిలి రచితరెడ్డి ఆధ్వర్యంలో పది మంది రక్తదానం చేశారు. ఆమె మాట్లాడుతూ రక్తం కొరతతో తలసేమియా వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని మందమర్రికి చెందిన మాంటెస్సోరీ పాఠశాల 2012 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులం రక్తదానం చేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రరెడ్డి రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్, సాయికుమార్, వర్షిత్, శివ, సాయిరాం, శ్రీకాంత్, విక్రమ్, పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నేడు అంతరాయం

ఏసీసీ, జూన్ 10 : మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడ పాత రైల్వే గేటు ఫీడర్ మెయిన్ పైపులైన్, ఎల్లంపల్లి నుంచి వచ్చే పంపింగ్ మెయిన్ లైన్‌లు పగిలినందున మంగళవారం పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్‌ల మరమ్మతు చేపట్టనున్నందున నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు


హెచ్చరిక బోర్డును పెడుతున్న రెవెన్యూ సిబ్బంది

నస్పూర్, జూన్ 10: నస్పూర్ శివారు సర్వే నంబరు 119లో ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే శిక్షార్హులంటూ సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును పెట్టించారు. ఇటీవల భూమి చదును చేసి దున్నారు. దీంతో స్పందించిన ఆర్డీవో రాములు, తహసీల్దార్ శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు ఆర్‌ఐ మాంతయ్య ఆధ్వర్యంలో సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు చేపట్టామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పగిలిన మంచినీటి పైపులైన్


పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

నస్పూర్, జూన్ 10: మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా అయ్యే మంచినీటి పైపులైన్ సోమవారం పగిలిపోవడంతో తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అంబేద్కర్ కాలనీ, ఫ్లడ్ కాలనీ, విలేజ్ నస్పూర్, తదితర ప్రాంతాల్లోని 9 మంచినీటి ట్యాంకులకు గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసే పైపులైన్ నస్పూర్ గేట్ వద్ద పగిలిపోయింది. మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో డ్రైనేజీ శుభ్రం చేస్తుండగా పైపు పగిలి నీరు ఎగిసిపడింది. వెంటనే సిబ్బంది అధికారులకు సమాచారం ఇచ్చి నీటి సరఫరాను నిలిపివేయించి మరమ్మతు చేపట్టారు.

బార్ అసోసియేషన్ తెలంగాణ జాయింట్ సెక్రెటరీగా జగన్



ఏసీసీ, జూన్ 10 : ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ జాయింట్ సెక్రెటరీగా మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఎన్నికల్లో జగన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగన్ ఎన్నికపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఏబీవీపీ సౌత్ జోనల్ సోషల్ మీడియా కన్వీనర్‌గా సుమంత్

ఏసీసీ, జూన్ 10 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సౌత్ జోనల్ సోషల్ మీడియా కన్వీనర్ జిల్లా కేంద్రానికి చెందిన పెండెం సుమంత్ నియమితులయ్యారు. గుజరాత్‌లోని సూరత్‌లో సోమవారం నిర్వహించిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి నాయకుడైన సుమంత్‌ను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించారు. సుమంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై సామాజిక మాధ్యమాలతోపాటు ప్రత్యక్షంగా పోరాటాలు చేస్తానని తెలిపాడు.

బడిబాట

మందమర్రిరూరల్, జూన్ 10 : బడిబాటలో భాగంగా పొన్నారంలో సోమవారం ఉపాధ్యాయురాలు సునీత ఇంటింటికి వెళ్లి పిల్లల వివరాలను సేకరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ప్రజావాణి ద్వారా సమస్యలు పరిష్కారం

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలు
- అదనపు కలెక్టర్‌కు వినతులు


ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 10: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌లతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, మందమర్రి, భీమిని, చెన్నూరు మండలాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.

దండేపల్లి: ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్‌లు కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఎలాంటి వినతులు రాలేదు.

వేమనపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపీవో శ్రీపతి బాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదని, ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నస్పూర్: జిల్లాలో కళాకారులకు కొదవలేదని, వారి ప్రదర్శనకు వేదిక లేకపోవడం వలన నిరుత్సాహానికి గురవుతున్నారని యువ కళా సమితి సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొనగిరి రాజారెడ్డి కోరారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

వీడియోగ్రాఫర్ల వేతనాలు పెంచాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీడియోగ్రాఫర్లు

బెల్లంపల్లి, జూన్ 10: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన వీడియోగ్రాఫర్‌లకు రోజువారీ ఇచ్చే వేతనాన్ని పెంచాలని సోమవారం అదనపు కలెక్టర్ రాహుల్‌కు వీడియోగ్రాఫర్లు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎలాంటి ఆటంకాలు, ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు జరిగే విషయాలను కవరేజ్ చేస్తూ నిరంతరం సేవలందించామన్నారు. రాష్ట్రమంతా ఒక విధానం కొనసాగితే మంచిర్యాల జిల్లాలో మాత్రం దానికి భిన్నంగా ఉందన్నారు. రాష్ట్రమంతా అమలవుతున్న వేతనం తమకు అమలు చేయాలని కోరారు. వీడియోగ్రాఫర్‌లు ఉమారాజ్, విక్రమ్, అఖిల్, చరణ్, రామ్, ఎలీషా, సాయి, సాయికుమార్, సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్, జూన్ 10: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. ర్యాలీగా వచ్చిన కార్మికులకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్‌కు అందించారు. సంఘాల జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డులో భవన నిర్మాణ కార్మికున్ని ఛైర్మన్‌గా నియమించాలన్నారు. ప్రతీ కార్మికుడికి లెబర్ కార్డును అందించాలన్నారు. 2009లో తీసుకున్న లెబర్ కార్డును ఆన్‌లైన్ చేయాలలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి ఐదువేల పెన్షన్, సాధారణ మరణానికి ఆరు లక్షలు, ప్రమాదవశాత్తు రూ.15 లక్షల ఏక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు సదానందం, అశోక్, గణేష్, శ్రీనివాస్, రమేష్, కోటయ్య, వివిధ మండలాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వర్కర్స్ ధర్నా

జిల్లాలో పని చేస్తున్న పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ వర్కర్స్‌కు జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ అందజేశారు. ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలో 8 పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ పని చేస్తున్న 50 మంది కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు జీవో నంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లను అమలు చేయాలన్నారు. నాయకులు సంపత్, రాజేశ్వరీ, అనిత, మల్లేశ్వరీ, సునిత, లక్ష్మి, ప్రేమలత, అనసూర్య, లావణ్య, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వర్కర్స్

పాత రహదారినే విస్తరించాలి

ఏసీసీ, జూన్ 10 : నేషనల్ హైవే 63లో భాగంగా దండేపల్లి మండలం రాయపట్నం నుంచి హాజీపూర్ మండలం వేంపల్లి వరకు రోడ్డును బ్రౌన్ ఫీల్డ్ అలైన్‌మెంట్ ప్రకారం నిర్మించాలని బాధిత రైతులు, బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 2018 నుంచి నేషనల్ హైవే 63 అలైన్‌మెంట్‌లను అధికారులు మూడుసార్లు మార్చారన్నారు. మూడోసారి రూపొందించిన అలైన్‌మెంట్ రైతుల పంటల భూముల నుంచి వెళ్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. మొదటి సారి రూపొందించిన అలైన్‌మెంట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, రెండోసారి రూపొందించిన బ్రౌన్‌ఫీల్డ్ హైవే రెండింటిని రియల్ ఎస్టేట్ మాఫియా, రాజకీయ దళారులతో కుమ్మక్కై మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చర్యల వల్ల కేంద్ర ప్రభుత్వానికి అదనంగా రూ.3 వేల కోట్ల భారం పడడంతోపాటు రైతులు నిరాశ్రయులవుతారన్నారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఒకసారి భూములు కోల్పోరని, మరోసారి హైవే నిర్మాణానికి భూ ములు ఇవ్వరన్నారు. కోర్టులు కూడా ఒకసారి భూని ర్వాసితులైన వారి భూములను మరో ప్రాజెక్టులో తీసుకోవద్దని పలుమార్లు తీర్పునిచ్చారని చెప్పారు. అయినా అధికారులు రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఎంపీ వెంటనే స్పందించి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతులు లగిశెట్టి రాజమౌళి, బొలిశెట్టి తిరుపతి, బోస్, పెట్టం తిరుపతి, శశిధర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌హెచ్ 63 నిర్వాసిత రైతులు

ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన

ఏసీసీ, జూన్ 10 : గ్రేడ్ 2 భాషా పండితులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. గ్రేడ్ 2 భాష పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఆర్థిక సహాయం

ఏసీసీ, జూన్ 10: పట్టణంలోని 17వ వార్డు ఎల్‌కే నగర్‌కు చెందిన పిట్టల సతీష్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్ సతీష్‌ను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, ప్రశాంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణాలో టీడీపీకి పూర్వవైభవం


మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

మందమర్రి టౌన్, జూన్ 10: తెలంగాణాలో టీడీపీకి పూర్వ వైభవం రానుందని, అందరూ అంకితభావంతో పని చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో 24 వార్డుల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమిగా ఏర్పడి విజయం సాధించిందని, తెలంగాణాలో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చంద్రబాబు తెలిపారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణాలో పోటీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. స్థానిక సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. పలు పార్టీలకు చెందిన వారు టీడీపీలోకి రావడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఎండి షరీఫా, విజయ, రాజు, సంధ్య, సుగుణ, కిష్టయ్య పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా సంపత్

టీటీడీపీ పట్టణ అధ్యక్షుడిగా రెండో జోన్‌కు చెందిన వాసాల సంపత్ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా పార్టీ అభివృద్ధికి పాటుపడతానని సంపత్ చెప్పారు.

ఐద్వా మండల కమిటీ ఎన్నిక


సమావేశంలో ఐద్వా నాయకులు

హాజీపూర్, జూన్ 10 : అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) మండల కమిటీని సోమవారం రాపెల్లి గ్రామంలో జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, అధ్యక్షురాలు పోతు విజయ, ప్రధాన కార్యదర్శి రజిత, రఫియా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలుగా పెంద్రం కళావతి, అధ్యక్షురాలుగా ఉగ్గే ఉమ, ప్రధాన కార్యదర్శిగా మానస, సహాయ కార్యదర్శిగా అనిత, కమిటీ సభ్యులుగా సులోచన, రాజుబాయి, నయిామున్నీసా, పద్మ, జయశ్రీ, స్వరూపలను ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షురాలుగా పెంద్రం కళావతి మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకు మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల, ఆడపిల్లల సమస్యలను ప్రభుత్వం,అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా ఐద్వా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.